ఇళ్ల పైనే విద్యుత్ తీగలు

- దిన దిన గండంగా ప్రజలు
- ఏళ్లుగా తీరని సమస్య
- విద్యుత్ అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు




శ్రీనగర్‌కాలనీ, మల్కాపూర్‌లో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు

జ్యోతినగర్: కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పాలక వర్గం చెబుతున్నా... అభివృద్ధి అనేది మాటలకే పరిమితమవుతోంది. ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించకున్నా పర్వాలేదు కానీ.. ఉన్న సౌకర్యాలను మెరుగు పర్చితే చాలనీ పట్టణవాసులు కోరుతున్నారు. కానీ వారి సమస్యలపై ఏళ్ల తరబడి మొత్తుకున్నా.. ప్రయోజనమే లేదని వాపోతున్నారు. సమస్యల పరిష్కారాన్ని ఎవ్వరూ సరిగ్గా పట్టించుకున్న దాఖలాలు లేవనడానికి శ్రీనగర్ కాలనీ, మల్కాపూర్ సాక్ష్యంగా నిలుస్తోంది. రామగుండం కార్పొరేషన్‌లోని ఐదో డివిజన్ శ్రీనగర్‌కాలనీ, మల్కాపూర్, చెరువు వద్ద కొంత భాగం ఉంటుంది. ఎన్టీపీసీ సంస్థ ప్రభావిత ప్రాంతంగా ఉన్న మల్కాపూర్ ఎన్టీపీసీ సీఎస్సార్ నుంచి చేపట్టిన అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం కన్పిస్తోంది. బూడిద పైప్‌లైన్ పేరుతో మల్కాపూర్ రోడ్డు వెడల్పును సైతం నిలిపివేశారు. ఈ సమస్యలకు తోడుగా ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగల సమస్యతో పాటు బ్రాహ్మణకుంట చెరువు, మల్లపురాణి కుంటతో పాటు సీఐఎస్ఎఫ్ బ్యారెక్ లోపల ఉన్న విద్యుత్ లైన్ ఉండటంతో సరఫరాలో సైతం అంతరాయంతో పాటు మరమ్మతులు కూడా లేటవుతున్నాయి. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత విద్యుత్ అధికారులపై ఉంది.

40 ఇళ్లపైగా విద్యుత్ తీగలు

మల్కాపూర్, శ్రీనగర్‌కాలనీ, ప్రశాంత్‌నగర్‌కాలనీల్లో సుమారుగా 40 పైగా ఇళ్ల మీద నుంచి విద్యుత్ తీగలు ఉండటంతో ప్రజలు వణికిపోతున్నారు. కొంతమంది తీగలను చూసి వారికి కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు సగం వరకు చేసుకుని తీగలు తొలగించే వరకు వేచి చూస్తున్నారు. శ్రీనగర్‌కాలనీలో లో-వోల్టేజీ సమస్య కూడా ఉంది. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

లో-వోల్టేజీ సమస్య తీర్చండి



శ్రీనగర్‌కాలనీలో లో-వోల్టేజీ సమస్య అధికంగా ఉంది. ఇటీవల అధికారులు వచ్చి త్వరలో సమస్య పరిష్కస్తామని చెప్పి వెళ్లారు. కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. చెరువుపై ఉన్న విద్యుత్ లైన్‌తో సరఫరాలో అంతరాయం ఏర్పడితే మరమ్మతు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. చెరువుపై ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చాలి.

– సంజీవరెడ్డి, శ్రీనగర్‌కాలనీ, ఐదో డివిజన్

తీగలు తొలగించండి



ఇళ్ల మీద ఉన్న తీగలు ఉండడంతో మా కుటుంబ సభ్యులు భయపడిపోతున్నారు. వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు తీగలు ఇంటి మీదుగా ఉండడం వల్ల చాలా ఇబ్బందులు పడ్డాం. విద్యుత్ అధికారులు ఇళ్లపై ఉన్న లైన్లను తొలగించి మా సమస్య పరిష్కరించాలి.

– దాస్, మల్కాపూర్, ఐదో డివిజన్

త్వరలోనే పరిష్కారం

మల్కాపూర్, శ్రీనగర్‌కాలనీలో ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్‌కు సంబంధించిన ఇంటి యజమానులకు ఎస్టిమేషన్ వేసి తెలియజేశాం. వారు చెల్లించాల్సిన రుసుము చెల్లిస్తే పనులు ప్రారంభిస్తాం. చెరువుపై ఉన్న విద్యుత్ లైన్‌కు సంబంధించిన పనులను కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి చేస్తాము.

–అడిచర్ల శ్రీనివాస్, ఏడీఈ, గోదావరిఖని

క్లుప్తంగా

వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామగిరి: సెంటినరీకాలనీలో నిత్యం కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలు, కోతుల బెడదను నివారించాలని కోరుతూ మంగళవారం జీఎం వెంకటేశ్వర్ రావుకు టీబీజీకేఎస్ ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య వినతి పత్రం అందజేశారు. క్వార్టర్ల వెనుకాల ఉన్న డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో పందులు, కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయని, దీంతో కాలనీవాసులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని, వాటి నుంచి కాలనీ వాసులను రక్షించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోనే చదవండి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి సంజీవ్, కేడెట్లు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా బోధన సాగుతోందని, ఎన్‌సీసీ శిక్షణ కూడా ఇస్తున్నామని ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ సంజీవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ఎన్‌సీసీ కెడెట్లు డ్రిల్ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీకాలేజీలో అధునాతనమైన లాబొరేటరీలు, సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులున్నారని వివరించారు. ప్రభుత్వ డిగ్రీకాలేజీలో చేరి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అధ్యాపకులు శ్రీనివాస్, రామకృష్ణ, అర్జున్, కిరణ్మయి, తిరుపతి తదితరులున్నారు.

బీమా పథకాలతో ప్రతీ కుటుంబానికి ధీమా



చెక్కు అందిస్తున్న మేనేజర్ లక్ష్మణ్

మంథని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలతో ప్రతీ కుటుంబానికి ధీమా లభిస్తుందని కేడీసీసీ బ్యాంకు మంథని మేనేజర్ దుమ్మని లక్ష్మణ్ అన్నారు. మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి సిలివేరి జయలక్ష్మి మృతి చెందగా, ఆమె పేరిట మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆమె కూతురు అనూషకు మంగళవారం అందజేశారు. సహకార బ్యాంకులో సేవింగ్ ఖాతా కలిగి ప్రతీ ఒక్కరూ ప్రధాన మంత్రి బీమా యోజన, జీవనజ్యోతి పథకాలకు ఇన్సూరెన్స్ తీసుకుంటే ఆ కుటుంబాలకు కష్టకాలంలో ఆసరాగా ఉంటుందని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి మరమ్మతు చేయాలి



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ శైలజ

మంథని: పట్టణంలోని ప్రధానచౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఫౌంటేన్, మెట్లు శిథిలావస్థకు చేరాయని దళిత నాయకులు తగరం శంకర్‌లాల్, మంథని లక్ష్మణ్, అక్కపాక సంపత్, కన్నూరి ఓదెలు, మంథని రాజపోషయ్య, మల్లేశ్, కాసిపేట రాజయ్య మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజకు వినతిపత్రం అందించారు. స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ శైలజ వెంటనే మరమ్మతులు చేయిస్తానని భరోసా ఇచ్చారు.

ప్లేట్‌లేట్ యంత్రం ప్రారంభం

సుల్తానాబాద్: రక్త పరీక్షల యంత్రం అందుబాటులో రావడం శుభపరిణామని ఎంపీపీ బాలాజీ రావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్లేట్‌లేట్ యంత్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోగులకు రక్త పరీక్షలు చేసేందుకు ప్లేట్‌లేట్ యంత్రం అందుబాటులోకి తీసుకురావడానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, డాక్టర్ రమాదేవి, చారి, జుల్‌ఫకర్,అనంతరెడ్డి, ముత్యం రమేశ్ గౌడ్, ఎంపీటీసీలు ఫకీర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ప్రజలకు మంచిచేసే ప్రభుత్వాలకు అండగా నిలవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీవో 58 పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్, 24 గంటల ఉచిత కరెంట్ తదితర పథకాల అమలుతో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తోందన్నారు. కొంతమంది నాయకులు యాత్ర పేరు పెట్టుకుని.. ఇంటింటికీ తిరుగుతూ కేసీఆర్ ఏంచేశారని అడగడం హాస్యాస్పదం అన్నారు. మరోసారి సీఎంకేసీఆర్‌పై ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ జావిద్‌పాషా, మేయర్ అనిల్ కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే నీచ రాజకీయాలు

నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారు ధ్వజమెత్తారు. మంగళవారం రామగుండం లారీ యజమానుల సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో లోడింగ్‌కు స్థానిక లారీలను వినియోగించాలని, సదరు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసి సాధించుకున్నామన్నారు. లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలపై అసత్యపు ప్రచారాలు చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్నవి దొంగ యాత్రలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో లారీయజమానుల సంఘం బాధ్యులు కొయ్యడ సుధాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పింగిలి భాస్కర్ రెడ్డి, కంది శ్రీనివాస్, బాబురావు, హరీష్, నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గోదావరిఖని: ప్రీతినాయక్ ఆత్మహత్యకు నిరసనగా బీజేపీ నాయకులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈసందర్భంగా బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రీతి హత్యకు ప్రధాన కారణమైన సైఫ్‌ను వెంటనే ఉరితీయాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శివకుమార్, సందీప్‌కుమార్, కుమ్మరి మల్లేష్, చిలుక శంకర్, చిలుముల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బామ్లానాయక్‌తండాలో కొవ్వొత్తుల ర్యాలీ

పాలకుర్తి: వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతినాయక్ మృతికి సంతాపంగా మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామంలో గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రీతి మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బదావత్ రాజునాయక్, నాయకులు ఇస్లావత్ లాల్‌సింగ్, కేల్‌ధాస్, శ్యామూల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు సాగు నీరందించాలని విజ్ఞప్తి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: ఎస్సారెస్పీ డీ–86, డీ–83 కాలువ చివరి భూములకు సాగునీరందించి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కాల్వ శ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష ఎస్సారెస్పీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాగునీరు లేక మండలంలోని ఇదులాపూర్, వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, రాతుపల్లి, తారుపల్లి, కిష్టంపేట, మొట్లపల్లి గ్రామాల్లో పొలాలు ఎండిపోతున్నాయని అధికారులకు తెలిపారు. మడిపెల్లి, గంగారం, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, రాతుపల్లి, కూనారం, మంగపేట గ్రామాల రైతులు హుసేన్ మియా వాగులో మోటార్లతో సైఫన్‌ల ద్వారా సాగు నీటిని వినియోగించి పంటలు పండిస్తారని, ఎస్సారెస్పీ నీటిని వాగులోకి వదిలితే వాగు పరివాహక రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులకు విన్నవించారు.

కాలువల్లో ముళ్ల పొదల తొలగింపు..

ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు ఎస్సారెస్పీ డీ–86 కాలువల్లో పేరుకు పోయిన ముళ్ల పొదలు, చెత్తను తొలగించి చివరి పంటకు సాగునీటి విడుదలకు చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ సంనత్ యాదవ్ తెలిపారు.

కాన్షీరాం విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి

రామగిరి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మార్చి 4న న కాన్షీరాం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సెంటినరీకాలనీలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బహుజనులు, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ నాయకులు బత్తుల శంకర్, నూనె రాజేశం, బూర్గు శంకర్ గౌడ్, బొంకూరి పోశం, సమ్మయ్య, కృష్ణ, స్వామి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి

పెద్దపల్లిరూరల్: బీసీల జనగణన చేపట్టాలని, జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని వాటి సాధన కోసం బీసీలంతా ఏకం కావాలని డీసీఎం వ్యాన్ అసోసియేషన్ నాయకులు బొంకూరి దుర్గయ్య అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 34వ రోజుకు చేరాయి. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోటిసంతకాల కార్యాచరణ చేపట్టి, దీక్షలకు దిగినా పాలకుల్లో చలనం లేదన్నారు. బీసీలంతా ఏకమై ఉద్యమించి పాలకుల మెడలు వంచి రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. నాయకులు సవిత, శారద, రాజబాబు, చందు, అరుణ్, ఇర్ఫాన్, సురేశ్ తదితరులున్నారు.

ఘనంగా టైలర్స్ డే

రామగుండం: పట్టణంలోని మేరు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి టైలర్ షాపులో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రెడీమెడ్ దుస్తుల ప్రభావంతో టైలరింగ్‌తో ఉపాధి పొందే వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేరు సంఘం ప్రతినిధులు నోముల రాజయ్య, మాడిశెట్టి రవీందర్, మొలుగూరు ఆనందం, రామగిరి రాజ్ కుమార్, పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ఓదెల: మండలంలోని నాంసానిపల్లె రేషన్ డీలర్ బిక్కునాయక్‌పై నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ శంకర్ తెలిపారు. లంబాడితండాకు చెందిన ఓ వ్యక్తి డీలర్ పనితీరుపై కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు గ్రామంలో డీలర్‌పై విచారణ చేపట్టగా అవకతవకలు నిజమని తేలడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'ప్రజా సంక్షేమంపై ఎమ్మెల్యేకు పట్టింపు లేదు'

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డికి రెండుసార్లు అవకాశమిస్తే అవినీతి, అక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జిల్లాకేంద్రంలో మంగళవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్ గౌడ్, నెత్తెట్ల కుమార్, కౌన్సిలర్లు సుభాష్‌రావు, సంపత్, నాయకులు శ్రీమాన్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీను మాట్లాడారు. పెద్దపల్లి కూరగాయల మార్కెట్ స్థలంలో రూ.5 కోట్లతో చేపట్టే పనులకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుకు వస్తున్న ప్రజాభిమానాన్ని జీర్ణించుకోలేకనే అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు తిరుపతి, నూగిల్ల వీరేశం, స్వరూప, శోభ, నరేశ్ తదితరులున్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కరోత్సవం



పూజల్లో పాల్గొన్న జీఎం , భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తృతీయ పుష్కరోత్సవం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి పర్యవేక్షణలో మంగళవారం కనులపండువగా నిర్వహించారు. రెండో రోజు ఆర్జీ–2 జీఎం మనోహర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు జగన్నాథాచార్యులు, మధుసూధనాచర్యులు భక్తులకు అర్చన, హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలి



పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

రామగుండం: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమించి.. వివిధ కేసుల్లో జైలు పాలై.. ఆర్థికంగా, సామాజికంగా నష్టపోయిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌ను అంతర్గాంలో మంగళవారం ఆవిష్కరించారు. మానుకోట ప్రతిఘటన, మిలియన్ మార్చ్, సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె వంటి ఘట్టాల్లో వేలాది మంది పాల్గొన్నారని, పోలీసు కేసులు, జైలు పాలైన వారిని గుర్తించి స్వాతంత్ర్య సమరయోధుల పథకాలు వర్తింపజేయాలని కోరారు. బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లతో ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, పిడుగు కృష్ణ ముదిరాజ్, జిల్లా ప్రతినిధులు అనితాచౌదరి, కనక లక్ష్మి, గుండేటి అయిలయ్యతదితరులున్నారు.

ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

ఎలిగేడు: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు బింగి రాజు అన్నారు. మార్చి 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యకారులు తానిపర్తి బుచ్చారావు, కవ్వంపల్లి రాము, బాసంపల్లి వినోద్, కాసిపాక రవి, కవ్వంపల్లి శ్రావణ్, శ్రీనివాస్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధిపై సవతి తల్లి ప్రేమ



మాట్లాడుతున్న కౌశిక హరి, కార్పొరేటర్ లత

రామగుండం: రామగుండంలో అనేక పరిశ్రమలు ఉన్నా.. అభివృద్ధిపై మాత్రం పాలకులు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్ కౌశిక లత అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వనరులున్న చోట విద్యుత్ కేంద్రాలను స్థాపిస్తే తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. బీ థర్మల్ విద్యుత్ కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం వారంలోగా స్పందించకుంటే రిలే నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఇక్కడి అభివృద్ధికి కేటాయించిన నిధులను మంత్రి సిద్దిపేటకు కేటాయించుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు మద్దికుంట శంకర్, నిమ్మరాజుల రవి, గాలెంకి ప్రసాద్, దారంగుల కుమార్ తదితరులున్నారు.

'అసత్య ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

ఎలిగేడు: ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాయకత్వంలో పెద్దపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాదయాత్ర పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, నిరాధార ఆరోపణలు చేస్తే విజయరమణారావును గ్రామాల్లో అడుగుపెట్టనివ్వబోమని ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎలిగేడులో మాట్లాడారు. విజయరమణారావు గతంలో 5ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి సొంత మండలానికి ఏమీ చేయలేక పోయారని, అదే సమయంలో రాజీవ్ రహదారి, ఎల్లంపల్లి పైప్‌లైన్ పనుల పేరిట డబ్బులు సంపాదించుకున్నారని ఆరోపించారు. దాసరి మనోహర్‌రెడ్డి పెద్దపల్లిలో హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే



ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి: మండలంలోని కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర పితామహుడు సర్ సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం . మాధురి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగుండం: సైన్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం మల్యాలపల్లి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అట్టముక్కలతో ఆకట్టుకునే రీతిలో ఫ్రిజ్, కూలర్, ఏటీఎం తదితర నమూనాలను తయారు చేయగా ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు స్రవంతి, శ్రీనివాస్, హెచ్‌ఎం.వడ్డెపల్లి రాజేశం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన 'సైన్స్ ఎక్స్‌పో' ఆకట్టుకుంది. బాల శాస్త్రవేత్తలు రూపొందించిన వినూత్న ప్రయోగాలను చూపరులను అబ్బురపర్చాయి. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి ప్రదర్శనలు తిలకించి అభినందించారు.

పెద్దపల్లిరూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు సైన్స్‌మేళా ఉపయోగపడతాయని డీఈవో మాధవి అన్నారు. పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో మంగళవారం నేషనల్ సైన్స్‌డే సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, అల్లెంకి శ్రీనివాస్, రజనీ, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

నూకాంబిక పోచమ్మ అర్ధ మండల దీక్షలు

రామగుండం: టీటీఎస్ అంతర్గాంలో స్వయంభూగా వెలిసిన శ్రీశ్రీశ్రీ నూకాంబిక పోచమ్మ తల్లి జాతరలో భాగంగా మంగళవారం పలువురు భక్తులు అర్ధ మండల దీక్షలు స్వీకరించారు. మార్చి 21వ తేదీన నిర్వహించే నూకాంబిక జాతరకు ముందు భక్తులు తమ మొక్కులను తీర్చుకునేందుకు దీక్షలు స్వీకరిస్తుంటారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది గర్భగుడిని పూర్తిగా పూలమయం చేసి కొలుస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గాం మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్, తదితరులు దీక్ష తీసుకున్నారు.

గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంటలో గ్రామ దేవతలు భూలక్ష్మీ, మహాలక్ష్మీ, బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు రేపటి నుంచి నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కట్కం రవీందర్, ఉప సర్పంచ్ గుమ్మడి సతీశ్, కమిటీ సభ్యులు తెలిపారు.దేవతల ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతో పాటు ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కుంకుమ పూజ, నవగ్రహ హోమం, శనివారం, ఆదివారం పోచమ్మ కొలుపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముప్పిరితోటలో సివిల్‌రైట్స్‌డే

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో మంగళవారం అధికారులు సివిల్ రైట్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ సాయి క్రిష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో కులవివక్షత లేకుండా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దొళ్ల ఐలయ్య, ఉపసర్పంచ్ చీకటి శైలజ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, వసతిగృహ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాస్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ అసెంబ్లీ

సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. పాఠశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహించడం గొప్ప విషయమని అతిథులు అన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించకుండా పార్లమెంటరీ శాసనవ్యవస్థ ప్రజాసంక్షేమ పథకాలపై ప్రజాసమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మండల రమేశ్, అధ్యాపకులు వెంకన్న, శ్రీధర్, విజయలక్ష్మి, వసంత, విశ్రాంత అధ్యాపకులు వీరలక్ష్మణ్ కుమారస్వామి, ఎస్ఎంఎస్ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.